# స్వయంకృతం

## ఆదూరి సావిత్రి



"శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ కళాశాల." అనే గుండ్రని అక్షరాలు చెక్కిన ముఖ ద్వారంలోనుంచి గుంపులు గుంపులుగా బయట కొస్తున్నారు అబ్బాయిలు, అమ్మాయిలు...

సైకిళ్ళమీదున్న స్టూడెంట్స్ రోడ్డుమీద నడుస్తున్న విద్యార్థి బుజంమీద ఒక చెయ్యివేసి, ఒక చేత్తో హ్యాండిల్ పట్టుకుని కంట్రోల్ చేసుకుంటూ విలాసంగా వస్తున్నారు...

రంగు రంగుల చీరలు, లంగాలు, పంజాబీ డ్రస్సులతో ఉన్న అమ్మాయిలు నవ్వుతూ తుళ్ళుతూ రోడ్డంతా ఆక్రమించుకుంటున్నారు..

పడమటి దిక్కుగా జారిన సూర్యుడు చీకూచింతాలేనట్లు తుళ్ళిపడుతున్న వాళ్ళందర్నీ, మొహమంతా ఎర్రగా చేసుకుని ఈర్ష్యగా చూస్తున్నాడు.

మధ్య మధ్య వాళ్ళను తప్పించుకుంటూ స్కూటర్లమీద, సైకిళ్ళమీదా వస్తున్నారు లెక్చరర్స్...

"ఏమే వాణీ సెలవలకెక్కడికన్నా చెక్కేస్తున్నావా... ఇంటికేనా ?" అన్నది ఉష.

నీలం రంగుమీద బంగారు కలరు చుక్కలున్న షిఫాన్ చీరతో... పొడుగ్గా ఉన్న జడను మధ్యకు మడిచి, మొదట్లో రిబ్బన్ పువ్వులా కట్టుకున్న తెల్లగా నాజూగ్గా ఉన్న పదహారేళ్ళ అమ్మాయి కళ్ళు పైకెత్తి చూస్తూ "ఏమిటే?" అన్నది.

"ఏ లోకంలో ఉన్నావ్ తల్లీ ? సెలవల కెక్కడికెడుతున్నారు రాణిగారు ?"

"ఈసారి ఇంటికెళ్ళను. మా అత్త దగ్గర కెడతాను. నాన్నగారు వెళ్ళమని రాశారు. ఈ రాత్రే హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేస్తున్నా." అన్నది వాణి.

"ఆ అత్తకేమన్నా కొడుకూ గట్రా ..."

"నీ మొహం. ఎవరూ లేరు. అంతా కూతుళ్ళే."

"అబ్బా ! వేస్టు !"

" మధ్యన నీకెందుకే దిగులు ?" అంటూ ఉషను మోచేత్తో పొడిచిందో అమ్మాయి.

ఇంతలో వెనకనుంచి "నిలువవే వాలుకనుల దానా...వయారీ హంస నడకదానా..." అంటూ ఈలపాట మొదలెట్టాడొకడు.

అమ్మాయిలంతా నిశ్శబ్దంగా అయిపోయారు

"ఏమిటి గురూ... ప్రకృతి ఇంత ప్రశాంతంగా మారిపోయింది ¡" అన్నాడు రవి.

"మన పాటంటే... మరి మజాకా అనుకున్నావేమిటి ?" మీసం మెలేస్తూ నవ్వాడు రాకేష్.

"ఇంతకీ మనలో వాలుకనుల వయ్యారి ఎవరూ ?" సందేహంగా గుసగుస లాడిందో అమ్మాయి.

"వాడికదో జబ్బు ... నీకిదో తెగులు. నోర్మూసుకో." చిన్నగా కసిరింది వాణి.

'శ్రీ గోల్డ్ కవరింగ్' ముందుకు రాగానే "నేను వానిషింగ్ క్రీము, పౌడరు, కొనుక్కోవాలే" అన్నది ఉష.

"పద, నేనూ జడపిన్నులు, తిలకం సీసా కొనాలి !" అన్నది వాణి.

వాళ్ళు షాపు మెట్లెక్కగానే "ఒరేయ్ నేను బెల్ట్సు, కర్చీఫ్‌లూ కొనాలి" అంటూ ఓ

నలుగుర్ని వెంటేసుకుని తెనూ షాపులో దూరాడు రాకేష్.

''ఖర్మ, స్వర్గానికిపోయినా సవతిపోరు తప్పదని ... '' గొణుక్కుంటూ గబగబా తమ క్కావలసినవి కొనుక్కొని బయటపడ్డారు అమ్మాయిలు.

* * *

విండోలోనుంచి వాణి ముఖం కనపడగానే బస్సు దగ్గరకొచ్చారు ఇందిర, జయ.

''అమ్మయ్యా! వచ్చావుగదా. మావయ్య నిన్నిక్కడికి రానిస్తాడో ... లేకపోతే ఇంటికే వచ్చెయ్యి అని లాక్కుపోయాడో ... నీ ఉత్తరం చూశాక కూడ మాకు సందేహమే. ఆఖరు క్షణంలోవచ్చి, పదపద ఇంటికి అన్నాడేమోనని'' నవ్వుతూ వాణి చేతులో లగేజ్ అందుకుంది జయ.

ఇంటికెళ్ళగానే అభిమానంగా ఎదురొచ్చింది రాజేశ్వరి.

''మొహం కడుక్కో. రాత్రనగా బయల్దేరావు. అన్నమైన తిన్నావోలేదో. ఇడ్లీ వేడిగా ఉంది. పెడుతున్నా, కారప్పొడి వెయ్యనా ... చట్నీ వేసుకుంటావా ?'' అన్నదామె హడావుడి పడిపోతూ.

''మేనగోడలొచ్చిందనే సంతోషంతో ఈ జీవుడి సంగతి మర్చిపోక. నాకు కంపెనీకి టైమవుతోంది'' జోక్‌గా అంటూ ''ఏం వాణీ పరీక్షలెలా రాశావ్ ?'' అన్నాడు పురుషోత్తం.

''బాగా రాశాను మావయ్యా. ఫస్ట్‌క్లాస్ ష్యూర్'' బ్రష్‌మీద పేస్టు వేసుకుంటూ అన్నది వాణి.

''బి. ఏ. ఎక్కడ చదువుతావ్ ?''

''ఎక్కడేమిటి ? ఇప్పుడు చదివేహోటే. ఆ కాలేజీలో బాగా చెపుతారు.''

ప్లేటులో ఆరిడ్లీలు పెట్టింది రాజేశ్వరి.

''నాయనోయ్! అన్ని తినలేనత్తయ్యా.'' అంటూ మూడు తీసి వేరే పళ్ళెంలో వెయ్య బోతున్న వాణిని వారిస్తూ ''మీ ఇంట్లో చేసినంత పెద్దవికావే. ఎంత చిన్నవో చూడు. ఇవి ఆరూ కలిసినా మీ ఇంట్లో మూడిటికి సాటిరావు.'' అన్నది రాజేశ్వరి.

ఎంత చెప్పినా, వాటిని మళ్ళీ వేసుకొని మేనగోడల్ని ''ఇంత నాజూకు తిళ్ళు తినబట్టే... గాలేస్తే ఎగిరిపోయేలా ఉన్నావ్.'' అంటూ మందలించింది.

* * *

''ఒదినగారూ జోస్యం చెప్పే కోయ వాడొస్తే పిలవమన్నారుగా. రండి.'' అన్న దొాకావిడ వచ్చి.

''నువ్వూ రావే వాణి. చెయ్యి చూపించు కుందుగాని. అతను చెప్పినవి చాలావరకూ నిజమౌతున్నాయిట. అంతా నమ్ముతున్నారు'' అంటూ వాణిని కూడా తనతో తీసుకెళ్ళింది రాజేశ్వరి.

వరండాలో ఓ పదిమందిదాకా కూర్చుని, కోయవాడుచెప్పే జోస్యం కబుర్లు వింటున్నారు...

''ఇదిగో ఇది నేను రామారావుతో, నాగేశ్వరరావుతో తీయించుకున్న ఫొటో. ఇది ప్రధానమంత్రితో తీయించుకున్నాను. ఇది వాణిశ్రీతో... వీళ్ళంతా నేను చెప్పిన జోస్యం నిజమైందనే సంతోషంతో నాతో ఫొటో దిగారు.'' అంటున్నాడతను.

''ఈ అమ్మాయి చెయ్యి చూడు,'' వాణి చెయ్యి పట్టుకుని ముందుకు చాపుతూ అన్నది రాజేశ్వరి.

''దీనికి ఇంటర్‌లో క్లాసొస్తుందా ?'' ఆత్రంగా అడిగిందామె.

''ఆ! ఫస్ట్ క్లాసొస్తది ఈ కూనను బి. ఎ లో ఒకడు ప్రేమించి పెళ్ళి చేసు కుంటడు...'' అంటున్నాడు కోయవాడు.

''ఇంతకూ... ఆ అబ్బాయి దీన్ని బాగా చూసుకుంటాడా ?'' నవ్వుతూ అన్నది రాజేశ్వరి.

వాణి ముఖంలో కదులుతున్న సిగ్గును, కుతూహలాన్నీ ఓరగా పరికిస్తూ ''ఓ! భేషుగ్గా చూసుకుంటడు. కదిలితే కందిపోతదనుకుంటడు. ఎర్రగా బుర్రగా నీకు సరిజోడుగా ఉంటడు...'' కోయవాడు చెపుతున్న మిగిలిన మాటలు వినటం మానేసింది వాణి.

తనను బి. ఎ లో ప్రేమించబోయేవాడి గురించి కలలు గనటంలో మునిగిపోయింది.

అస్తమానం ఈ విషయంమీద జోక్ చేసేవారు ఇంట్లో అంతా. ''జాజిపువ్వులా ఉంటావ్! ఎవడైనా... ఎగరేసుకుపోయి మరీ చేసుకుంటాడు నిన్ను.'' అనేది రాజేశ్వరి.

రిజల్ట్సు వచ్చాయి...

వాణి ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది.

''నే చెప్పలా ? ఆ కోయదొర చెప్పినవన్నీ నిజమౌతుంటాయి.'' అన్నది రాజేశ్వరి.

''అయితే... ఇంక నీ హీరో రంగప్రవేశం చెయ్యటం మిగిలిందన్నమాట'' అంటూ నవ్వింది జయ.

వాళ్ళందరి మాటలూ వాణి ఎదిగీఎదగని మనసుమీద బలంగా పనిచెయ్యసాగాయి...

కొందరు... ఏదో జోక్ చేస్తున్నామని మాత్రమే అనుకుంటారుగానీ... తమ మాటల ప్రభావం ఆ పసిపిల్లలమీద ఎలా ముద్రపడు తోంది... దీని ఫలితం ఎంత దారుణంగా ఉంటుంది అనే విషయాన్ని కొంచంకూడా ఆలోచించరు.

హైదరాబాదునుంచి వచ్చేశాక బి. ఎ.లో చేరింది వాణి.

* * *

బి. ఎ. సెకండియర్‌కూడా సగం గడిచి పోయింది. దిగులుగా ఉంది వాణికి.

ఇదేమిటి ? ఇంతవరకూ తనెవర్నీ ప్రేమించ లేదు !

మరి జోస్యం ?

పడుచుదనంలో చెలరేగే కోరికల్ని సాంప్రదాయం...కట్టుబాటు అనే సంకెళ్ళతో బంధించి, మనసు నడుపులో పెట్టుకుంటారు ఆడపిల్లలు.

అలాగే సాగబోతున్న వాణి మనసుమీద కోయజోస్యం ఊహించని విధంగా పని చేస్తోంది. హైదరాబాదులో తనవాళ్ళందరి మాటలూ ఇంకాస్త ఎగదోస్తున్నాయి. ఆ అమ్మాయికి తెలియకుండానే సాంప్రదాయపు సంకెళ్ళు లూజయి, ఆలోచనలన్నీ కట్ట తెగిన వరదలా తనను ప్రేమించబోయే వాడిచుట్టూ విజృంభించ సాగాయి.

శృతిచేసిన వీణలా ఉన్న ఆమె మనసు ఏ చిన్న ఆధారామైనాసరే పట్టుకోటానికి సిద్ధంగా ఉంది. తననెవరూ ప్రేమించకుంటే ?

చదువై ఇంటికెళ్ళాక... తన పైనున్న ముగ్గురక్కల పెళ్ళిళ్ళూ అయి, తనదాకావచ్చే సరికీ తనుకాస్తా ముసలిదై పోతుంది.



# స్వయంకృతం

నో ! జోస్యం అబద్ధంకాకూడదు. తనది లౌ మ్యారేజ్ ! అంతే !

* * *

ఏదో ఆలోచిస్తూ పుస్తకాలు గుండెల కదుముకుని నడచివస్తున్న వాణి ఎదురుగా వస్తున్న ఓ యువకుడు బలంగా ఢాషివ్వటంతో తూలిపడబోయి ఆపుకుంది.

"సారీ వాణీ !" అంటూ కిందపడ్డ పుస్తకాలు ఏరి చేతులో పెడుతున్న అతన్ని చిరాగ్గా చూసింది. తన పేరు కూడా తెలుసే !

"కోపంగా ఉందా ? నిజంగా ... కావాలని ఢాషివ్వలేదు నేను" సిన్సియర్‌గా, మృదువుగా అన్నాడతను.

మాట్లాడకుండా చరచరా వెళ్ళిపోతున్న వాణిని చూసి పెదవి విరిచి బుజాలెగరేశాడు తను.

ఆ తర్వాత అతననేకసార్లు ఆమె దృష్టిలో పడ్డాడు. వాణిని చూడగానే అతని పెదవులు కొంటెగా నవ్వేవి.

"ఎవరా హీరో ?" పక్కనున్న రమ నడిగింది వాణి.

"అతనిపేరు అశ్వద్ధామ. ఫైనల్ బి.ఎస్‌సి. చదువుతున్నాడు" అన్నది రమ.

"నయం. ఘటోత్కచుడని పెట్టుకో లేదు !" గట్టిగా నవ్వింది వాణి.

వెనక్కి తిరిగి చూశాడు అశ్వద్ధామ.

"నెమ్మదిగా నవ్వలేవూ ?" రమ మాటలకూ, అతని చూపులకూ బెదిరి టక్కున నోరు మూసుకుందామె.

* * *

కాలేజీ వెనకాలున్న గార్డెన్‌లో గుబురుగా పెరిగిన చెట్లచాటున వాణి ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు అశ్వద్ధామ.

"వాణీ ... ఇంత త్వరగా దగ్గరౌతామనుకో లేదు. ఈ ఊర్వశి నా ప్రియురాలనుకుంటే ... ఓహ్ ! సంతోషంతో మతిపోతోంది నాకు ... " అంటున్నాడతను.

"ఊఁ! ఇంకా ... " కొంటెగా నవ్వింది వాణి.

"ఇంకా చాలా ఉంది. నువ్వొప్పుకోట ల్లేదుగా ?" నిష్ఠూరంగా అన్నాడతను.

"పెళ్ళయ్యాక అన్నీ ఒప్పుకుంటాను."

"అంతవరకూ అడ్వాన్సుగా..."

"ఒద్దు."

"రేపు రాత్రి ఏడు గంటలకు బాగుంది. వేణుగోపాలస్వామి గుళ్ళో దండలు మార్చేసు కుందాం. నా ఫ్రెండ్స్ నలుగురు సాక్షులుగా వస్తారు, నీ ఫ్రెండ్స్‌నికూడా పిలుచుకో."

"నిజంగా ?!" సంభ్రమంగా అన్నది వాణి.

"నిజం !" అంటూ లేచాడు అశ్వద్ధామ.

అతను ప్రజెంట్ చేసిన ఎరుపుమీద జరీ పువ్వులున్న బెనారస్ చీర కట్టుకుంది వాణి.

ఆమె ఫ్రెండ్సే ముత్తయిదువులుగా వ్యవహరించి, కాళ్ళకు పారాణిపెట్టి, నుదుట కల్యాణ తిలకం, బుగ్గన చుక్క దిద్దారు.

తలంటుకున్న తలలోనుంచి తప్పించు కొచ్చిన ముంగురులామె పచ్చని ముఖం మీద పొరాడుతున్నాయి.

కింద పెదవిని పైపంటితో నొక్కిపెట్టి వాణిని చూశాడు అశ్వద్ధామ.

మంచి పర్సనాలిటీ, చక్కని ఛాయతో అందంగా ఉన్న అతను పెళ్ళి బట్టల్లో ఇంకా అపురూపంగా ఉన్నాడు.

"అదృష్టమంటే మీదే. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అన్నట్లున్నారు." అంటున్న ఫ్రెండ్స్ మాటలకు ఇద్దరూ గర్వంగా నవ్వుకున్నారు.

అశ్వద్ధామ గదిలోనే అందరికీ చిన్న పార్టీ లాంటిది అరేంజ్ చేశాడు...

ఆ కోలాహలమంతా అణిగి, అందరూ వెళ్ళి పోయాక అశ్వద్ధామ, వాణి ఇద్దరే మిగిలారు.

ఇదంతా చాలా థ్రిల్లింగ్‌గా ఉంది వాణికి.

అశ్వద్ధామవేపు సరిగ్గా తలెత్తి చూడలేక పోతోంది.

ఆమె దగ్గరగా వచ్చాడతను..

అతని పెదవులామె మెడచుట్టూ ప్రదక్షిణం చేసి ముందుకొచ్చి, అక్కడేదో ఆకర్షణ మెరుపులా కొట్టటంతో కదలలేనట్లు ఆగిపోయాయి...

ఊపిరి నిలిచిపోతుందా అనిపిస్తోందామెకు...

"వాణీ... మాట్లాడు... ప్లీజ్ !" అస్పష్టంగా... మత్తుగా ఉందతని కంఠం.

జవాబుగా ఆమె చేతులతన్ని పెనవేసు కున్నాయి. పట్టలేని ఆవేశంతో ఆమెను చుట్టుకున్నాడతను.

... ... ... ... ...

అశ్వద్ధామ రూంలోనే ఉంటోంది వాణి.

అంతకుముందు వాణితోసహా ఓ అయిదుగు రాడపిల్లలు రమ నాయనమ్మ పర్యవేక్షణలో ఒక ఇల్లు తీసుకుని ఉండేవాళ్ళు.

అశ్వద్ధామ చాలా ప్రేమగా చూసుకునే వాడు వాణిని. మగవాడితో పెనవేసుకున్న ఆడపిల్ల జీవితం ఇంత సుందరంగా...అద్భుతంగా ఉంటుందా ! అనుకుంటూ విస్తుపోతోంది వాణి.

వాణి సెకండియరు, అశ్వద్ధామ ఫైనలియరూ ఎగ్జామ్స్ రాశారు.

ఇంటికి ప్రయాణమయ్యాడు అశ్వద్ధామ.

"నేనింక చదవను. మీతో వచ్చేస్తాను." బేలగా అన్నది వాణి.

"నువ్వీ సెలవలకి ఇంటికెళ్ళు. చదువు మానటంలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు. నేను నిన్ను మోసం చేస్తానని భయపడకు. నువ్వు నా ప్రాణానివి.



ఆటోమాటిక్ రిస్ట్‌వాచ్
కేవలం రు. 25/- మాత్రమే 21 జువల్స్ హెచ్.ఎం.టి. ఆటోమాటిక్ రిస్ట్ వాచ్ వైన్ పద్ధతితో, 7 సంవత్సరముల గ్యారంటీతో కేవలం రు. 25/- మాత్రమే లభిస్తుంది. కావలసినవారు పోస్టేజి, మరియు ప్యాకింగ్ ఖర్చుల నిమిత్తం అదనంగా రు. 10–95 ను క్రింది అడ్రసుకు పంపవలెను.
**BASANT TRADING Co., (A)**
PO LALBIGHA, (NAWADAH).

గొప్ప అవకాశం
ఫొటోగ్రఫీ, కలర్ ఫొటోగ్రఫీ మరియు స్క్రీన్ ప్రింటింగ్
పూర్తి సాంకేతిక విజ్ఞానాన్ని సులభమైన పద్ధతిలో నేర్చుకొనండి. పోస్టుద్వారా ఇంగ్లీషు లేదా హిందీ లేదా తమిళంలో నేర్పబడును. ప్రాస్పెక్టసుకొరకు వ్రాయండి.
**KALAIMATHI NILAYAM**
Nanjai thalaiyur-639 204.
TAMILNADU.


సెక్సు, మూత్రవ్యాధులు, సంతానము, గర్భాశయ వ్యాధులు, మొలలు, చర్మ వ్యాధులకు అనుభవచికిత్స. పోస్టుద్వారా చికిత్స కలదు.
సరోజ నర్సింగ్ హోమ్,
డాక్టర్ యస్. సరోజిని,
H.O. కొత్తపేట చౌకు, విజయవాడ–1.
బ్రాంచి : శీలంవారివీధి, జిన్నాటవర్, గుంటూరు.

సినీతారలు
మీకు నచ్చే నలుగురి తారల సెక్సీ ఫొటోసెట్ 10 రూ.
మీరు మెచ్చే ఒక నటి,నటుడి ఫొటో సెట్ 5 రూ.
నటీనటుల అడ్రసులగల డైరీ 2 రూ.
కావలసినవారు M.O. చేయండి.
వై.కె.మూర్తి
బాపనవారివీధి విజయవాడ. 2.

కానీ... ఇంత హఠాత్తుగా మనం ఇంటికెడితే... అక్కడ మనకి ఘనమైన సత్కారాలేం లభించవు. ముందు నే వెళ్ళి నచ్చచెప్పి, నిన్ను తీసుకెడతాను. మా నాన్నకి కోపమొస్తే ఆయన చెప్పే మొదటి డైలాగ్ 'నా ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వను.'

ఏం తిని బ్రతుకుతాం? ప్రాక్టికల్‌గా ఆలోచించాలి గదా. ప్రేమనే తిని జీవించలేం.

నా మాట విను వాణీ. ఇన్నాళ్ళు నీతో కలిసి ఉన్నాను. ఆ మాత్రం మమత, బంధం నాకుండవా?

ఈ అడ్రసు నీ దగ్గరుంచు. లెటర్స్రాయి. మన విషయం తేలిందాకా ... నేను తరుచుగా వచ్చి నిన్ను చూసిపోతుంటాను.'' ఆమె గడ్డం పట్టుకుని, బ్రతిమాలుతున్నట్లుగా అన్నాడు అశ్వద్ధామ.

''సరే. సెలవలయిపోయి, నేనిక్కడి కొచ్చేసరికి, మీరు నాకోసం వచ్చెయ్యాలి.'' కన్నీళ్ళతో అన్నది వాణి.

''ఓకే!'' అంటూ ఆమె కళ్ళు తుడిచి, ఆమె నుదుట చుంబించి, వెళ్ళిపోయాడతను.

* * *

సెలవులయి తిరిగి వచ్చిన వాణి అశ్వద్ధామ కోసం క్షణమొక యుగంగా ఎదురు చూసింది.

ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు.

తను ప్రగ్నెంట్! ఇలాంటప్పుడు అది మాత్రం తప్పకుండా నస్తుంది.

ఏం చెయ్యాలి? మళ్ళీ తనవాళ్ళకి ముఖమెలా చూపాలి? అసలా భర్త అనబడే వ్యక్తి ఉంటే ఎలాగో నచ్చజెప్పొచ్చు.

అతనేడి?

కాలేజీలో అందరికీ తనకూ, అశ్వద్ధామకూ పెళ్ళయినట్లు తెలుసు. చాటుగా చెవులు కొరుక్కున్నా... అంత గొడవేం లేదు.

చివరికో నిశ్చయానికొచ్చి, ధైర్యం చేసుకుని అశ్వద్ధామ ఇచ్చిన ఎడ్రస్ పట్టుకుని అరసవీడు ప్రయాణమయింది వాణి...

''అరసవీడు... అరసవీడు...'' కండక్టర్ అరుపుతో తడబడుతూ బస్సు దిగింది వాణి.

రోడ్డుమీదనుంచి ఒక ఫర్లాంగు లోపలికి ఉంది ఊరు. శుద్ధ పల్లెటూరు.

గుండెల్లో అదటుగా.. నాలుక పిడచగట్టుకు పోతున్నట్లుగా ఉందామెకు.

అతనిక్కడే ఉన్నాడా? తనను చూసి ఏమంటాడు? ఒంటరిగా బస్సుదిగి ఊళ్ళోకొస్తున్న ఆ అమ్మాయిని కుతూహలంగా వింతగా చూస్తున్నారు జనం.

''ఓరింటికెళ్ళాల?'' తలగుడ్డవిప్పి, మళ్ళీ సరిగ్గా చుట్టుకుంటూ అడిగాడో రైతు.

వాణి సమాధానం చెప్పేలోగా పొడుగు చేతుల చొక్కా, చీలమండలదాకా పంచకట్టుకున్న ఒక నలభయ్యయిదేళ్ళ మనిషి ఆమె దగ్గర కొచ్చాడు.

''ఎవరింటికెళ్ళాలి?'' అని అడిగాడు వాణి కళ్ళల్లో బెదురును, అదటును నిశితంగా చూస్తూ.

''రామ్మోహన్రావుగారింటికి.'' నాలుకతో పెదవులు తడిచేసుకుంటూ అన్నది వాణి.

''ఏం పని ఆయనతో?''

''ఆయన కొడుకు అశ్వద్ధామ. నా...నేను, అతను ఒకే కాలేజీలో చదువుకున్నాం.''

''ఈ ఊర్లో ఉంటానని చెప్పాడా?''

''ఔను. ఈ అడ్రసే ఇచ్చాడు. రామ్మోహన్రావుగారు ఈ ఊరి ప్రెసిడెంటుట. మీకు తెలుసా?''

''నేనే రామ్మోహన్రావును.''

''వ్వాట్?!'' పక్కలో బాంబు పడ్డట్టు అన్నది వాణి.

''ఏం? ఎందుకంతాశ్చర్యం? నా గుణగణాలూ, రూపురేఖలూకూడా వర్ణించి చెప్పాడా? రాక్షసుడులా ఉంటానన్నాడా?'' వెటకారంగా అన్నాడాయన.

''అబ్బెబ్బే! అదేంలేదండీ, మీరు... చాలా మంచివారని చెప్పాడు'' ఖంగారుగా అందామె.

''సరే, ఇంటికి పద'' అంటూ వాణిని ఇంటికి తీసికెళ్ళాడాయన.

''ఎవరీపిల్ల?'' ముఖం చిట్లించుకుంటూ అడిగిందాయన భార్య.

''ఎవరోలే, తర్వాత చెవుతాను'' అంటూ ''నువ్వు స్నానమదీ చెయ్యి'' అని వాణికి చెప్పి ''ఇదిగో, నువ్వాపిల్లని ప్రశ్నలతో చంపావంటే... బొమికలేరేస్తాను.'' అంటూ గాండ్రించాడాయన భార్యను.




ఇంతలో ''రెడ్డి'' అని ఎవరో పిలవటంతో బయటకెళ్ళిపోయాడాయన.

స్నానానికి నీళ్ళు తోడుతూ వివరాలడిగిందాయన భార్య.

''ఏమిటేమిటీ! మా కొడుకుతో చదువుతున్నావా! అసలు మాకు కొడుకులే లేరు!'' అంటూ పెద్దగా నవ్విందావిడ.

''అదేంటీ? మీ ఆయన పేరు రామ్మోహన్రావు కాదూ? ఆయనీ ఊరి ప్రెసిడెంటు కాదూ?'' కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే అయోమయంగా అడిగింది వాణి.

ఇంకా పసితనం వీడనట్లున్న ఆ అమ్మాయి ముఖం చూస్తూ జాలిగా అన్నదావిడ.

''అమ్మాయ్! వాడెవడో తప్పుడు ఎడ్రసిచ్చి నిన్ను బాగా మోసం చేశాడు. నిన్ను చూడగానే ...ఏదో ఇలాంటి కేసే అని చెప్పి, మా ఆయన నమ్మించి నిన్నీ కొంపకి తెచ్చాడు. మా ఆయన రామ్మోహన్రావు కాదు. ఈ ఊరి ప్రెసిడెంటు పేరదికాదు. ఆయన పేరు చెంచురెడ్డి. అసలా పేరుగల వాళ్ళెవరూ ఇక్కడ లేరు. నా మాట విని మా ఆయనొచ్చేలోగా నువ్వెళ్ళిపో. ఇప్పుడు బస్సుంది పద నిన్నెక్కిస్తాను. ఇంకెప్పుడూ ఇలా ఒంటరిగా ఎక్కడకీ వెళ్ళకు. నిన్ను పంపేసినందుకు నా మొగుడేసే శిక్ష నేను భరిస్తాలే'' అంటూ వాణి దొడ్డిదారిన తీసికెళ్ళి బస్సు ఎక్కించేసొచ్చిందావిడ.

తిరునాళ్ళలో తప్పిపోయిన చిన్నపాపలా ఉంది వాణి. భయం... దుఃఖం ఆమెను చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చెయ్యసాగాయి.

అశ్వద్ధామ వాణి నుంచి సాంతం పారిపోయాడనే సంగతి కాలేజీ అంతా స్పష్టంగా తెలిసిపోయింది.

దొంగ సానుభూతులు ... హేళనలు ... వీలైతే తాము కూడా ఓసారి ఆమెను పొందాలనే మగవాళ్ళ వేట ... కారడవిలో ... కార్చిచ్చు నడుమచిక్కిన లేడికూనలా గజగజలాడిపోతోంది వాణి.

ఎక్కడికెళ్ళాలి? ఏం చెయ్యాలి?

ఇంటికి ఏ ముఖంతో వెడుతుంది?

నేనున్నానని ధైర్యం చెప్పేవారెవరు?

ఇంతటి విశాల విశ్వంలో ... దగాపడిన ఆడపిల్లకు జానెడు చోటు దొరకదు.

వాటేపిటీ!

ఇదంతా ''స్వయంకృతం.''

తన అజ్ఞానం. తెలిసీ తెలియని మూర్ఖత్వం.

ఆ తెల్లారి ...

వాణి అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని ప్రకృతి స్తంభించలేదు.

కాలం ఆగిపోలేదు.